# ప్రమోషన్

"ట్రింగ్, ట్రింగ్,ట్రింగ్ ట్రింగ్," .. "హల్లో! హిస్టరీ లెక్చరర్ హియర్. మీరు... ఓహో, కామర్స్ మాస్టారా! వూళ్ళో కొచ్చారా? మా కాలేజీకి రాక పోయారా! ... ఆఁ. యేమున్నాయండీ ! ఏదో ఇల్లా ఉన్నాం. సిలబస్సు లయిపోయాయిలెండి... ఏమిటీ ప్రిన్సిపాల్ శూల హస్తం తెలుసా అంటారా! భలేవారే! తెలీకపోటమేంటండీ! శ్రీకాకుళం జోన్ వాడు. ఎట్లా ఉంటాడంటే ఏం చెబుతామండీ? ఎవడిష్టం వాడిది. భారద్దేశం కదా! ఏమైనా మనిషి సరసమైన వాడు కాడండీ మంచితనమా, మచ్చుక్కూడా ఉన్నట్టు కనిపించదు. కాజువల్ లీవ్ లెటరిస్తే నేలకేసి కొడతాడు. కుర్రాళ్ళతో డీలింగు విషయం... చెప్పకండి, బాబోయ్, ఎల్లిమీద పిల్లిని, పిల్లిమీద మల్లిని, మల్లిమీద బల్లిని ఎక్కించి ఆనందించటమే కదండీ ఆయన చేసే పని! ఏనాడైనా క్లాసుల్లో కెళ్ళి వాళ్ళున్నారా వూడారా చూశాడా! అబ్బే, కాలేజీ కొచ్చాడంటే కుర్చీకి అతుక్కు పోయాడన్నమాటే!... ఏం చేస్తాడంటారా! బిల్లులండీ, బాబూ బిల్లులు! చుట్టూ కాష్ బుక్కులు పరుచుకుని, ' తదరినానంనా'అని సంగీతం పాడుకుంటాట్ట! ... లెక్చరర్స్‌ను ఏం అనడా అంటారా, ఎందుకంటాడు? వాళ్ళకీ ఆయనకీ బ్రహ్మాండంగా కలిసి పోతేనూ! ఈయన క్కావలసిన సంతకాలు, వోచర్లూ వాళ్ళు పెట్టేస్తూంటేనూ! ఇద్దరు కుర్రాళ్ళు క్లాస్ టెస్ట్‌లో ఫెయిల్ అయితే వాళ్ళని డైరెక్ట్‌గా సస్పెండ్ చేసేవాడు. అక్కడి నుంచీ వాళ్ళు నిరసన, బాయ్‌కాట్, స్ట్రైకు వరసగా సిస్టమాటిక్‌గా జరిపేశారు. గమ్మత్తేటంటే, ఇప్పుడు వాళ్ళే ఆయనకి నమ్మినబంట్లు!... వైసెస్ విషయం చెప్పేదేముందండీ, బాబూ ! క్లబ్బులో పేకాడుతూన్నప్పుడు చేతిలోకి రాణిముక్కవస్తే ఒహ పట్టాన దాన్ని దింపడే! దాన్ని వేళ్ళతో తడుముతాడెందుకంటారు?... మత్తులో ఉన్నా కూడా అదేం పనిండి! మత్తులో ఉన్న వాడికి సహజ లక్షణాలు బయటికొస్తాయనేది మనకు తెలియంది కాదుగదా! అబ్బే, అతగాడు ఒట్టి డాష్ డాష్ అనుకోండి! పొద్దున్నే ఆయన పేరు స్మరించుకుని లేస్తే నరకం ఖాయం! సర్లెండి, ఎక్కడో ఉన్నాయన్ని గురించి మన కెందుకు లేండి!

" ఆఁ, ఏమిటీ, ఆయన్ని జోను మార్చారా? మా కాలేజీకే ట్రాన్స్‌ఫర్ చేశారా! చంపేశారు! చెప్పరేమండి, మరి! ఏమిటో వద్దనుకున్నా నా చెవిని పడుతూంటాయి కదా దుర్వార్తలు. నా కెందుకయ్యా ఇవన్నీ చెబుతా వన్నాను. అయినా ఆ సుబ్బారావ్ వినందే! ఇంకో పావు గంట నుంచునుంటే ఆ నిస్వార్థవ్యక్తి శ్రీ శ్రీ శ్రీ శూలహస్తంగార్ని గురించి ఎన్నెన్ని అపనిందలూ, అపభ్రంశాలూ వినాల్సొచ్చేదో ! అందుకనే చాల్చేల్లేవయ్యా ఆయనెంతటి పెద్దమనిషో నే నెరగనా! అవార్డుకు తగినవాడు!... అనొచ్చేశాను కానీ, లేకపోతేనా! నా బెస్టు ఫ్రెండు కదండీ ఈయన... ఏమిటీ, లెక్చరరు సుబ్బారావు ఇప్పుడు మీ పక్కనేఉన్నాడా ఆదా, మరి... మరి... ఛ,ఛ, శ్రీ శ్రీ ఈ సుబ్బారావుగారు కాదండీ నేన్చెప్పేదీ అటెండరు, అటెండరు. అతనూ అక్కడి మొయిలువలస వాడే కదండీ మరి అందుకని శ్రీ శూలహస్తంగారంటే ఏడుపు. అయినా, మాష్టారూ, ఎవడిపాపాన వాడే పోతాడనేది మనకు తెలీదా, చూట్టంలేదా? నేను చేసిన తప్పొప్పులకి నేనే గదా బాధ్యుణ్ణి! . ఆహాఁ నేను చాలా నిజాయితీ పరుణ్ణనీ, అధికారం కోసమూ డబ్బు కోసమూ అర్రులు చాచేవాణ్ణి కాదనీ నేను చెప్పుకుంటే బాగుండదు కానీ నా కస్సలు అవ్వంటే మంట. ధర్మం జయిస్తుందండీ బాబూ ధర్మమే జయం! ప్రిన్సిపాల్ పోస్టనేది కత్తిమీద సామయి పోయింది. నేనసలు లెక్చరరుగానే ఉండిపోతే బాగుండుననిపిస్తూంది సుమండీ!

" ఇంకో వార్త! చెప్పండి   మరీ నన్ను ప్రిన్సిపాల్ గా ప్రమోట్ చేసి మొగుల్తుర్రు వేశారా! వ్వాట్! రియల్లీ! అబ్బబ్బ ఏం సస్పెన్సండీ, చంపేస్తున్నారు. ఇంతకీ అక్కడ స్టూడెంట్సు  స్ట్రెంగ్త్ ఎంతట? పన్నెండొందలా అంటే పన్నెండు ఇన్టు పది, పన్నెండు వేలన్నమాట!  అహాహ ఏం లేదు. నా లెక్కేదో నోరుజారి పైకొచ్చేసింది లెండి! మొగల్తుర్రు తాలూకా కేంద్రమనుకుంటాను అన్ని ఆఫీసులూ ముఖ్యంగా ట్రెజరీ ఆఫీసు, గాస్ కంపెనీ, ఆడపిల్లల స్కూలు, ఆఫీసర్ క్లబ్బూ వగైరా ముఖ్యమైన వన్నీ ఉన్నాయనుకుంటా! ఆ అదే, అదే ఫరవాలేదు లెండి. ఏదో కొంత పేరు ప్రతిష్టలతో గెటాన్ అయిపోవచ్చు ...క్లబ్బెందు కేమిటి- పరపతి కోసం కాదూ! పరపతి పుట్టేది పేకాటలోనే అని తెలీదా! ఆ, ప్రిన్సిపాలుద్యోగ మైనా అంతే, ప్రైమ్ మినిస్టరుద్యోగమైనా అంతే అన్నట్టు డ్రామా ఆక్ట్రెస్ డొరాతిది అవూరే కదూ! ఏం గెయిటూ, ఏం గ్రేసూ, ఏం గెస్టిక్యులేషన్సూ! సర్లెండి, శుభవార్త చెప్పారు. అన్నట్టు హోటల్ థ్రిల్ కొచ్చెయ్యకూడదూ, రాత్రికి పార్టీ చేసేసుకుందాం! ఓ.కే.

... " ఆ, ఏంటీ, నన్ను మొగల్తుర్రు వేశారు కానీ, కాన్సిల్ చేసి కొల్లేరేశారా! అది లాస్ట్ వీక్ మంత్రిగారు ఎనౌన్స్ చేసిన కాలేజీయే కదండీ! నేనే మొదటి ఉద్యోగి ననుకుంటాను అక్కడ. డబ్బు కట్టించుకుని నేనే రసీదు లిచ్చి కుర్రాళ్ళని నేనే చేర్చుకోవాలనుకుంటాను, గోల! మై గుడ్ గాడ్! తీసి కెళ్ళి బే ఆఫ్ బెంగాల్లో వేయలేకపోయారా! ఈ వార్తయినా ఖాయమే నంటారా? అయినా ప్రమోషన్ లిస్టులో నా పైన నలుగురున్నారు కదా ఆ నలుగురికీ వచ్చేసినయ్యా పోస్టింగులూ అని ఏం చచ్చారో! . తాంక్సా, మీకు తాంక్సా! మహ గొప్ప వార్త చెప్పారు కదూ ! ఈ ముండ మోపి వార్తకి ఇంత సస్పెన్సా?  ఇది మీకు మర్యాదేటండీ! కోపం ఉంటే ఇట్లాగా తీర్చుకోవటం! చాల్చాల్లేండి.

" ... ఇంకో వార్తా? అక్కర్లేదు, పెట్టే స్తున్నాను. ఏటీ, మీరు ముఖ్య మంత్రిగారి ఫ్రెండుకొడుకు కామర్సు లెక్చరరుగారు కారూ . నా ఇంట్లో చిన్న వెధవ్వా! నాతో నీకు చెప్పే నీతి కబుర్లు ఎంత వరకూ నేను పాటిస్తున్నానో చూద్దామని గొంతు మార్చి మాట్టాడావా! పుండాకోర్! డర్టీ రోగ్! ఇన్సెక్ట్! నీ తోలు వల్చకపోతే చూడు!" ట్రింగ్.

(ఆంధ్రప్రభ సచిత్రవారపత్రిక 14-12-83)

* * *   * * *   * * *